

# నవ్వుతూనే...!

అబ్బూరి ఛాయాదేవి

'విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. అంతరాయానికి చింతిస్తున్నాం!' అనడానికి అక్కడెవరూ లేరు. ఉన్నా కనిపించరు. అంతా చీకటి!

ముందు గదిలో ఆయనో కుర్చీలోనూ, నేనో కుర్చీలోనూ కూర్చుని ఉన్నాం. అంతవరకూ హడావుడి చేసిన టీవీ ఒక నిట్టూర్పు విడిచి చడీ చప్పుడూ లేకుండా ఉండిపోయింది.

ఆయన ఆలోచనల్లో ఆయనా, నా ఆలోచనల్లో నేనూ. ముఖం కనిపిస్తే ముచ్చటగానో ముటముటలాడుతూనో మాట్లాడుకోవచ్చు. ఎదురుగుండా కూర్చున్నారని తెలిసీ, టెలిఫోన్లో మాట్లాడినట్లు ఎలా మాట్లాడటం? అయినా, ముచ్చటగా మాట్లాడుకోవడానికి కొత్తగా పెళ్లయిన వాళ్లం కాదు కదా! ముప్పయ్యేళ్ల కాపురం-అరిగిపోయిన రికార్డులం. సమస్యలు కొత్తవైనా వాదం పాతదే.

మౌనంలోనే అవగాహన కలుగుతుందని చెబుతారు తత్త్వబోధకులు -అంటే, మనస్సు కూడా మౌనంగా ఉన్నప్పుడే. అనదలచుకున్న మాటలన్నీ పైకి అనేస్తే ఇంక సంభాషణ 'ఛెడామడా'యే! మర్యాద కోసం లోవల్లోవల అనుకుంటూ కూర్చుంటే శిరోవేదన! లోవల కూడా ఏమీ అనుకోకుండా ఉన్నప్పుడే అవగాహన కలుగుతుందిట!

ఆయన ఏమని ఆలోచిస్తున్నారో నాకు తెలియదు. నా మనస్సులో మాత్రం అమ్మాయి గురించీ, అల్లుడి గురించీ, వాళ్ల పెళ్లి తంతు గురించీ ఆలోచనలు మొదలయ్యాయి.

పెళ్లి కాగానే వాళ్లు 'హనీమూన్'కి గోవా వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పింది అమ్మాయి. అప్పటికింకా పెళ్లి కాలేదు! నిశ్చితార్థం అయిందంతే. ఫోన్లో గంటల తరబడి రాత్రి పన్నెండూ-ఒంటిగంట వరకూ మాట్లాడుకునేవారు. ఇద్దరికీ ఏం కబుర్లు ఉండేవో ఏమిటో? నెలరోజుల క్రితం వరకూ అతనెవరో దానికి తెలియదు, అదెవరో అతనికి తెలియదు!

సంబంధం మేము నిశ్చయించినదే. ఈయన పెత్తండ్రి కొడుకు తెచ్చాడీ సంబంధం. ఆయన బావమరిది ఆఫీసర్ కొడుకు-ఈ పెళ్లికొడుకు. కట్నంమీద ఆశ లేదు వాళ్లకి అనగానే సంబరపడ్డాం. కానీ ఆ సంబరం క్షణంకూడా నిలవలేదు. "పెళ్లి మాత్రం ఘనంగా చెయ్యాలి, ముద్దుముచ్చట్లు జరపడం ఎలాగూ చేస్తారనుకోండి..." అన్నారు వాళ్లు. అదుగో, ఆ ముద్దుముచ్చట్లలో భాగమే పెళ్లికొడుకునీ, పెళ్లి కూతుర్నీ 'హనీమూన్'కి గోవాకి పంపించడం. అంటే, ఉత్తినే రైలు ఖర్చులే కాదు, అక్కడి హోటల్ ఖర్చులూ, ఇతర ఖర్చులూ...

"ఆ కాండిల్ వెలిగించరాదూ?" అన్నారాయన చీకట్లో కూర్చునే.

ఎమర్జెన్సీ బాటరీ లైట్ కొనమంటే వినిపించుకోరు. ఏం, ఆయన లేచి వెలిగించొచ్చు కదా? అబ్బే, ఎందుకు లేస్తారు? ఇంట్లో దీపం పెట్టడం ఇల్లాలి ధర్మం కదా! అందుకే కదా, ఎవరికైనా పెళ్లాం పోతే, ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేదు, మళ్లీ పెళ్లి చేసుకోమని అంతా జాలిపడుతూ సలహా ఇస్తారు! సరే, ఆయన నాకన్నా వయస్సులో పెద్ద కదా, పోనీలే అని నేనే లేచి వెళ్లి, చెప్పిన పని చేశాను. ఆ 'పెద్ద'రికం నిలబెట్టుకోవడం ఆయనకి బాగా తెలుసు.

మా పెళ్లప్పుడు మనుగుడుపులకి వెళ్లడం తప్పించి, ఈ 'ప్రణయయాత్ర' మాటే లేదు. ఆఫీసులో సెలవు తీసుకోవడం కష్టం అంటూ వారం తిరక్కుండా ఆఫీసుకి బయలుదేరారు. ఆయనది ప్రభుత్వోద్యోగం కాదు లేటుగా వెళ్లడానికీ, చీటికీమాటికీ సెలవు పెట్టడానికీను. ప్రైవేటుది. అందుచేత ఓ వేళాపాళా లేదు. ఎప్పుడూ పనే. ఎప్పుడు వెళ్లవల్సివచ్చినా సిద్ధంగా ఉండాలి. ఎప్పుడు అత్యవసరపరిస్థితి ఏర్పడుతుందో తెలియదు. నన్ను ఎక్కడికైనా తన కూడా తీసుకువెళ్లాలంటే ఎప్పుడూ కుదిరేది కాదు! "వృద్ధిలోకి రావాల్సినవాడు, ఎప్పుడూ నీ కొంగు పట్టుకు కూర్చోమంటే ఎట్టా?" అనేవారు అత్తగారు. ఎన్నేళ్లు గడిచినా అంతే. ఇంటి బాధ్యతా, పిల్లల పెంపకం బాధ్యతా, చదువుల బాధ్యతా అంతా నాదేనని ఉప్పొంగలేకపోయేదాన్ని. ఉక్రోషం వచ్చేది. మొగుడితో కలిసి సరదాగా వెళ్లే అదృష్టం లేదు. అందరూ ముచ్చటగా ఎలా వెడుతుంటారో మరి? ఆ రోజుల్లో ఆ సీరియల్ నవలలు చదవకుండా ఉన్నా బావుండేది, ఇటువంటి ఆలోచనలు వచ్చేవి కాదేమో! పోనీ, పిల్లల్ని చూసుకుంటూ మురిసిపోదామా అంటే, వాళ్లు అవసరం తీరగానే గూటిలోంచి తుర్రుమని ఎగిరిపోయే రకం. వాళ్ల చదువులూ, వాళ్ల స్నేహితులూ, వాళ్ల పార్టీలూ-వాళ్ల లోకం వాళ్లది. వాళ్ల అవసరాలు చూసిపెట్టేందుకు 'అమ్మ' ఎప్పుడూ తయారుగా ఉంటుందన్న ధీమా. ఉండకపోతే అమ్మదే లోపం. ఆయన నాటిన విత్తనాలేగా!

ఓసారి పిల్లలిద్దరూ వాళ్ల కాలేజీ విద్యార్థులతో కలిసి వినోదయాత్రకి వెళ్లారు మైసూరుకి, పదిహేను రోజులపాటు. ఆయన ఏ కళనున్నారో, 'కాశ్మీరు వెడదా'మన్నారు. మాకు ఏ 'మూనూ' లేదు'వెంటిలేటర్ లోంచి చంద్రుడు కనిపించి నిద్ర పాడుచేస్తున్నాడని, ఆ వెంటిలేటర్‌ని మూసేయించిన మహానుభావుడు! నన్ను తీసుకుని కాశ్మీరు వెళ్లడానికి ఎలాగో ఒప్పుకున్నారు-పిల్లలు తిరిగి వచ్చేలోగా మేమూ వచ్చెయ్యొచ్చునని. ఆ సమయానికి అత్తగారూ, మామగారూ మా దగ్గర లేరు-అందుకని ఆ వంకా లేదు-ఇల్లు వదలి ఎలా వెళ్లడం అనుకోవడానికి. కుక్కని ఎప్పుడూ పెంచలేదు. లేకపోతే, అదొక బంధం.

విమానంలో కూర్చుని, శ్రీనగర్‌లో దిగేవరకూ నాకు నమ్మకం కలగ్గలేదు-మేము విహారయాత్రకి వెడుతున్నామని! ఇంట్లోనే పడి ఉంటే ఏ ముద్దూ ముచ్చటా ఉండదు. కాశ్మీరు లాంటి చోటికి వెడితే, స్థానబలిమి వల్లనైనా అన్ని పనులూ మరచిపోయి కాస్త సరదాగా గడపటానికి వీలవుతుంది. ఆ జ్ఞాపకాలతో కొంతకాలం ఉత్సాహంగా ఉంటుందని నా ఆశ.

కానీ రెండే జ్ఞాపకాలు మిగిలాయి నాకు-ఆ అనుభవాలు రెండూ మంట పుట్టించినవే-ఒకటి శరీరానికీ, ఒకటి మనసుకీ. శ్రీనగర్ నుంచి పెహల్‌గావ్‌కి వెళ్లేటప్పుడు కొండమీదుగా గుర్రాలు ఎక్కి వెళ్లాం. దారి సన్నగా ఉంది. గుర్రం

మిగతాది 23వ పేజీలో.....

## ఉగాది డాట్ కామ్



**కా**నరాక తీపిరాగాల కోకిల
వనమంతా వెతికింది వయ్యారి వసంతం
మనసూరుకోక మయూరాన్ని కదిపింది
పింఛాల మహారాణి అదోలా చూసి
ఏటేటా స్వాగతం పలుకుతున్నా
మాకు ఒరిగిందేమిటి?... దెప్పిపొడిచింది
రాకరాక వచ్చిన రారాజు క్లింటన్‌కు స్వాగతం తెలిపితే
కోకిల పాట మెచ్చి డాలర్స్ ఇచ్చి సన్మానించి
వైట్ హౌజ్ వాషింగ్టన్‌కు ఆహ్వానించే
కోకిల పాట కొండాకోనలకు పరిమితం కారాదని చెప్పే!
విదేశాల వింతవలలో పాశ్చాత్యబాణీలు నేర్చి
కంప్యూటర్ కానలో డాలర్స్ మేనాలో
విహరించే కోకిల హృదయాన్ని వెబ్‌సైట్‌లో బంధించే
వసంతం డాట్ కామ్‌లో కనిపిస్తుంది కోకిల నాట్‌కం!
పంచె కట్టి క్లింటన్ పచ్చడి రుచి చూడ
పసిఫిక్ దాటి ఆంధ్రావనికి విచ్చేసే
హైటెక్ తెలుగుతేజం మెచ్చేసి
వెంట తెచ్చిన డాలర్ వసంతం తెలిపే ఉగాదికి
ఆహ్వానం!

గుజ్జుల వెంకటకృష్ణారెడ్డి

.....17వ పేజీ తరువాయి

మరీ ఎత్తుగా లేదు. మనల్ని గుర్రంమీద కూర్చోబెట్టి, గుర్రంవాడు పక్కనే నడుస్తూ దాన్ని నడిపిస్తాడు. ఆ గుర్రం కొండ అంచు వెంబడే నడుస్తుంది. కిందికి చూస్తే బాగా లోతైన లోయ. గుర్రం మీంచి పడిపోతే మళ్లీ దిక్కుండదు. వెడుతూంటే చచ్చేంత భయం వేసింది. ఆ గుర్రం ఒంటెలాగ ముందుకీ వెనక్కీ ఊగుతున్నట్లు కదుల్తూ మెల్లిగా గతుకుల బాటమీంచి పోతుంటే, రాపిడికి కూర్చున్నంతమేరా నా శరీరం ఒరుసుకుపోయి మంట పుట్టేది. సర్దుకుని కూర్చోవడానికి సావకాశం లేదు. గుర్రం కంగారుపడి కాలుజారి లోయలో పడిపోతుందన్న భయం. నేను భయపడుతున్నకొద్దీ ఆ గుర్రంవాడు పక్కనుంచి గట్టిగా వాటేసుకుని "కోయీ డర్ నహీఁ!" అంటూండేవాడు. వాడి మురికిబట్టలూ వాడూ, అలా గట్టిగా నా నడుము చెయ్యేసి పట్టుకుంటే చిరాకేసినా, చెయ్యగలిగిందేమీ లేదు.

మర్నాడు అనంత్‌నాగ్‌కి వెడదామని ఆయన అనగానే "బాబోయ్! నేను రాలేను!" అన్నాను. మా బాగా అయిందన్నట్లు ఆయన పకపకా నవ్వారు. ఆ పుండూ, మంటా కాస్త తగ్గాక, మర్నాడు "హౌస్ బోట్‌లో షికారు వెడదాం!" అన్నాను. వద్దు పొమ్మన్నారు.

"కాశ్మీరుకి వచ్చి హౌస్ బోట్‌లో షికారు వెళ్లకపోవడం ఏమిటి! ఎవరైనా వింటే నవ్వుతారు!" అన్నాను.

"గుర్రం మీద కూర్చుని వెడితే కింద పుండు పడిందంటే నవ్వరా? ఒకళ్ల కోసమా, మన కోసమా?" అన్నారు.

"అసలు హౌస్‌బోట్‌లో వెళ్లాలనే ఆశతోనే నేను కాశ్మీరు ప్రయాణానికి ముచ్చటపడ్డాను!" అన్నాను-వెళ్లకపోతే నాకెంత నిరుత్సాహం కలుగుతుందో చెప్పాలని. షర్మిలాటాగూరూ, షమ్మీకపూరూ మనసులో మెదిలి నా కోరిక మరింత పెరిగింది.

"హౌస్ బోట్లో వెళ్లాలంటే అసలు నిన్ను తీసుకొచ్చేవాణ్నే కాదు!" అన్నారు.

"మీకెందుకంత పట్టుదల? నా సంతోషంకోసం ఆ మాత్రం రాలేరా?" అన్నాను బతిమాలుతున్న ధోరణిలో.

"నీ సంతోషం కోసమే కదా ఇంత ఖర్చుపెట్టి ఇంత దూరం విమానంలో తీసుకొచ్చాను!" అన్నారు ఇంక తిరుగులేదన్నట్లు.

ఆయన ఎప్పుడూ అంతే. వాదంలో నెగ్గలేం. నేనేదైనా కొత్త వంటకం చేస్తే ముట్టుకోరు.

"పండగ కదా అని ప్రత్యేకం చేశాను. ఎలా ఉందో రుచైనా చూడండి!" అంటే,

"నీ ప్రయోగాలతో నన్ను చంపకు!" అంటారు.

"పండగపూట ఏమిటా మాటలు! సరదాగా కొత్త వంటకం చేస్తే కాస్త నాకోసమైనా తినడానికేం? నేను కష్టపడి చేశాను అనైనా తినొచ్చు కదా!" అంటే,

"తక్కినవి కూడా నువ్వు చేసినవే కదా, అవి తింటున్నా కదా!" అంటారు. అంతేకానీ, మొహమాటానిక్కూడా ముట్టుకోరు. పైగా, "పెళ్లాం దగ్గర మొహమాటం ఏమిటి?" అంటారు. అంత మొండి మనిషి.

ససేమిరా హౌస్‌బోట్ ఎక్కనన్నారు.

"ఏమిటి మీ అభ్యంతరం?" అన్నాను నిలదీసి.


"ఆ బోటువాడు ఆ సరస్సు మధ్యలోకి తీసుకెళ్లాక మళ్లీ ఒడ్డుకి చేర్చనంటే? చేర్చాలంటే ఇంతిమ్మనీ అంతిమ్మనీ బెదిరిస్తే ఏం చేస్తావ్?" అన్నారు.

ఓస్, ఇంతేనా! అన్నట్లు నవ్వి, "ఆ వెడుతున్నవాళ్లందరూ అంత వెర్రిపీనుగులా?" అన్నాను.

"వాళ్లు వెడితే వెళ్లారు, వాళ్ల కర్మ!" అన్నారు మరింత మొండిగా.

నేను కోపంతో బిగుసుకుపోయాను. ఆ తర్వాత కాశ్మీరు శాలువా కొనిపెడతానన్నా అక్కర్లేదు పొమ్మన్నాను. మర్నాడు తిరుగు ప్రయాణం పెట్టుకున్నాం, కానీ, వాతావరణం బాగాలేదని విమానయానం రద్దుచేశారని తెలిసింది.

ఆ రోజంతా హోటలు గదిలో మాటామంతీ లేకుండా గడిపాం-ఆయన ఏవో పేపర్లు చదువుకుంటూనూ, నేను ఉలెన్ స్వెట్టర్ అల్లుకుంటూనూ. ఆ సంఘటన నా మనసుని దొలుస్తూనే ఉంది. మా ప్రయాణం గురించి విశేషాలు చెప్పమని పిల్లలు అడిగితే ఏం చెప్పాలి? నా కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. పెళ్లాం ముచ్చట తీర్చాలని ఇన్నేళ్లయినా తెలుసుకోనివాళ్లకి ఎలా తెలియజెప్పడం? గుర్రాన్ని నీళ్లదాకా తీసుకెళ్లగలం కానీ, దానిచేత్త నీళ్లు తాగించలేం కదా!




కాశ్మీరుకి వెళ్లినా తగవులు రాక మానలేదు! ఆ పాటిదానికి ఇంట్లోనే పడుంటే సరిపోయేది. కాశ్మీరు ప్రయాణం దండగ అయిందనిపించింది.

పిల్లలు సరేసరి! వాళ్లంతకంటేనూ! వస్తూనే వాళ్ల వినోదయాత్రావిశేషాల్ని పోటీలు పడి చెప్పడం మొదలుపెట్టారు. మా ప్రయాణవిశేషాలు ఏమిటని అడగాలని వాళ్లకి తోచనేలేదేమో. ఇక ఉండబట్టలేక, నేనే చెప్పాను క్లుప్తంగా. హౌస్‌బోట్ విషయం కూడా చెప్పేశాను.

"అసలు మీకు లైఫ్ ఎంజాయ్ చెయ్యడం తెలియదమ్మా!" అంటూ ఒక్క ముక్కతో కొట్టిపారేశారు అన్నావెల్లెల్లిద్దరూ.

ఇప్పుడు అమ్మాయి గోవా ప్రయాణం బాగా సంతోషంగా గడుపుతూ ఉండిఉండాలి. ఎంతైనా ఇద్దరూ చిన్నవాళ్లూ, కొత్తగా పెళ్లయి మంచి మోజులో ఉన్నవాళ్లూ కదా!

హఠాత్తుగా ఫోన్ మోగేసరికి గుండె జల్లుమంది. ఆయన కూడా ఉలిక్కిపడి కుర్చీలోంచి లేవబోయారు.

"ఉండండి, నేను ఎత్తుతాను!" అని లేచాను.

ఫోనెత్తి, "హలో!" అనగానే, "హాయ్, మమ్మీ!" అంది అమ్మాయి-గోవా నుంచి.

"గోవా ఎలా ఉందే?" అన్నాను.

"ఫెంటాస్టిక్!" అంది. గొంతులో ఉత్సాహం పొంగుతోంది.

"మీరిద్దరూ ఎలా ఉన్నారు? ఈ టైములో చేశావు, బయటికి ఎక్కడికీ వెళ్లలేదా?" అన్నాను.

"లేదు మమ్మీ! ఎక్కడికైనా బయల్దేరాలంటే ఆయనకి బద్ధకం! రోజంతా గదిలోనే ఉందామంటారు. హి ఈజ్ సచె బోర్, మమ్మీ!" అంది గునుస్తున్నట్లు.

"అతనక్కడే ఉన్నాడా?" అన్నాను దాని మాటలకి కాస్త కంగారుపడి.

"ఆఁ, ఇంకెక్కడుంటారు? అరుగో, శేషశాయి పోజులో!" అంటూ కిలకిలా నవ్వింది.

ఆయన కుర్చీలోంచి లేచి వచ్చేసరికి ఫోన్ ఆయన చేతికిచ్చాను.

అది ఆ మాటలని అంత ధైర్యంగా నవ్వుతూ అన్నందుకు సంతోషించాను. అలిగీ, పోట్లాడీ మగవాడి మనస్సుని కొంతవరకూ మార్చవచ్చు. కానీ, నచ్చని విషయాలనైనా నవ్వుతూ తీసుకోగలిగితే సంతోషంగా బతకడం ఎలాగో సగం తెలిసినట్లే! అది నాకన్నా తెలివైనదే. దాని కాపురం విషయమై నా మనస్సు తేలికైంది. ■